క్లుప్తంగా

విత్తనాల గొడౌన్ పరిశీలన



విత్తనాలను పరిశీలిస్తున్న ఏడీఏ మహరాజన్, తదితరులు

బొండపల్లి: మండలంలోని నెలివాడలో గల ఏపీ సీడ్స్ వరి విత్తనాల గొడౌన్‌ను వ్యవసాయ శాఖ గజపతినగరం సబ్ డివిజన్ ఏడీఏ కె.మహరాజన్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా గొడౌన్‌లోని ఐదు చోట్ల శాంపిల్స్ సేకరించారు. వీటిని పరీక్ష నిమిత్తం ల్యాబ్‌కు పంపించనున్నట్లు ఏడీఏ తెలిపారు. రైతుల నుంచి సేకరించిన విత్తనాలకు అన్ని పరీక్షలు నిర్వహించామని అధికారులు ఏడీఏ దృష్టికి తీసుకువచ్చారు. దీనికి ఏడీఏ స్పందిస్తూ మరోసారి పరీక్షలు నిర్వహించిన తర్వాత రైతులకు అందించాలన్నారు. కార్యక్రమంలో ఏఓ పి.వి.మల్లికార్జునరావు, తదితరులు పాల్గొన్నారు.

గాలికి ఎగిరిపోయిన పైకప్పు



రేకు పడిపోవడంతో ఖాళీ అయిన పైకప్పు

దత్తిరాజేరు: మండలంలోని కోమటిపల్లి రైల్వే స్టేషన్‌లో మూడో లైన్ నిర్మాణంతో పాటు స్టేషన్ ఆధునీకరణలో భాగంగా కొద్ది రోజుల కిందట ప్లాట్ ఫారం నంబర్ 3లో కొత్తగా వేసిన రేకులు బుధవారం తెల్లవారుజామున వీచిన గాలికి ఎగిరిపోయాయి. నిత్యం రద్దీగా ఉండే రైల్వే స్టేషన్‌లో ఆ సమయంలో ఎవ్వరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పిందని పలువురు అభిప్రాయపడ్డారు.

60 మందికి నేత్ర పరీక్షలు



చిన్నారిని పరీక్షిస్తున్న వైద్యుడు

దత్తిరాజేరు: మండలంలోని మరడాం గ్రామ సచివాలయం వద్ద వైజాగ్ శంకర్ ఫౌండేషన్ వైద్యులు బుధవారం నిర్వహించిన నేత్ర వైద్య శిబిరానికి స్పందన లభించింది. 60 మందిని పరీక్షించి 23 మందిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేసినట్లు క్యాంప్ సూపర్‌వైజర్ జోగారావు తెలిపారు. కార్యక్రమంలో గ్రామపెద్ద శంకరరావు, తదితరులు పాల్గొన్నారు.

సంతాపం..



చలుమూరి కృష్ణ (ఫైల్)

శృంగవరపుకోట: మండలంలో విధులు నిర్వహిస్తున్న వీఆర్వో ఆకస్మిక మృతి పట్ల తహసీల్దార్ అరుణకుమారి సహా మండల రెవెన్యూ ఉద్యోగులు సంతాపం వ్యక్తం చేశారు. మామిడిపల్లి, వేములాపల్లి గ్రామాలకు వీఆర్వోగా బాధ్యతలు నిర్వహిస్తున్న చలుమూరి కృష్ణ విశాఖలోని పినాకిల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మధ్యాహ్నం కన్నుమూశారు.

అర్హులకు గుర్తింపు కార్డులు



గుర్తింపు కార్డు వల్ల కలిగే ప్రయోజనాలను వివరిస్తున్న వీఆర్‌ఓ, తదితరులు

గుర్ల: అర్హులైన కౌలు రైతులకు కౌలు రైతు గుర్తింపు కార్డులు (సీసీఆర్‌సీ) అందజేయనున్నట్లు గుర్ల వీఆర్‌ఓ కె. వెంకటరమణ, వీఏఏ కృష్ణారావు తెలిపారు. బుధవారం స్థానిక సచివాలయంలో కౌలు రైతులతో సమావేశం నిర్వహించి, గుర్తింపు కార్డులు పొందడం వల్ల కలిగే లాభాలను వివరించారు. కార్డులు కావాల్సిన వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కౌలు రైతులకు అన్నదాత సుఖీభవ పథకంతో పాటు బ్యాంక్ రుణాలు మంజూరు చేస్తామన్నారు.

30న మోడల్ పరీక్ష

విజయనగరం గంటస్తంభం: స్థానిక గురజాడ గ్రంథాలయం కేంద్రంగా ఈ నెల 30న డీఎస్సీ మోడల్ పరీక్షను నిర్వహించనున్నామని డీవైఎఫ్ఐ జిల్లా కన్వీనర్ హరీష్ తెలిపారు. బుధవారం ఎల్బీజీ భవనంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్‌జీటీ అభ్యర్థులకు మాత్రమే పరీక్ష నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ ప్రశ్నపత్రాన్ని విద్యావేత్త, మాజీ ఎమ్మెల్సీ లక్ష్మణరావు తయారు చేస్తున్నారని పేర్కొన్నారు. రూ.50 ఎంట్రీ ఫీజు చెల్లించి పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. వివరాలకు 8019273486, 7095956895 నంబర్లను సంప్రదించాలన్నారు. ఆయనతో పాటు ఉపాధ్యక్షుడు సతీష్ ఉన్నారు.

అన్నదాతంటే అంత అలుసా..!

- రేషనలైజేషన్ పేరుతో రైతుసేవా కేంద్రాల కుదింపు
- కొన్ని గ్రామాల్లో పూర్తిగా కనుమరగుకానున్న కేంద్రాలు
- రైతులకు అందని సూచనలు, సలహాలు
- ఎరువులు, విత్తనాలకూ ఇకపై కటకటే..
- ప్రభుత్వం తీరును ఖండిస్తున్న రైతులు



పోరలి రైతుసేవా కేంద్రం

దత్తిరాజేరు: వైఎస్సార్‌సీపీ హయాంలో దేశానికే రోల్‌మోడల్‌గా తీర్చిదిద్దిన రైతు భరోసా కేంద్రాలు (ప్రస్తుతం రైతుసేవా కేంద్రాలు) కూటమి ప్రభుత్వం తీరు వల్ల త్వరలోనే కనుమరుగు కానున్నాయి. ఉన్న ఊరిలోనే రైతులకు అన్ని రకాల సేవలు అందించాలనే లక్ష్యంతో గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వీటిని ఏర్పాటు చేశారు. వీటి ద్వారా పంట సాగుకు అవసరమైన అన్ని రకాలు సేవలు అన్నదాతలకు అందేవి. పంటలకు సంబంధించిన సూచనలు, సలహాలు అందించడంతో పాటు విత్తనాలు, ఎరువులు అందించేవారు. పండిన పంటలకు కూడా గిట్టుబాటు ధర కల్పించి కొనుగోలు చేసేవారు. దీంతో రైతులకు ఎంతో మేలు జరిగేది. అయితే ఇటీవల కాలంలో అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం రైతుభరోసా కేంద్రాలను రైతుసేవా కేంద్రాలుగా మార్చి.. ఈ వ్యవస్థనే నిర్వీర్యం చేయడానికి కుట్రలు పన్నుతోంది. రేషనలైజేషన్ పేరుతో కేంద్రాలను కుదించేందుకు ప్రయత్నిస్తోంది. ఇప్పటికే ఉన్న సిబ్బందిని సర్దుబాటు పేరుతో ఇతర సంస్థలకు బదలాయించేందుకు చర్యలు తీసుకుంటోంది. కూటమి ప్రభుత్వం తీరు వల్ల ఇకపై అన్నదాతకు అన్నీ కష్టాలే..

75 మంది సిబ్బంది

గజపతినగరం నియోజకవర్గంలో దత్తిరాజేరులో 17, గజపతినగరంలో 20, గంట్యాడ 22, బొండపల్లి 16 కలిపి మొత్తం 75 రైతుసేవా కేంద్రాలున్నాయి. ఇందులో 75 మంది వీఏఏలుగా విధులు నిర్వహిస్తున్నారు. రేషనలైజేషన్ పేరుతో ఇందులో సగం మందిని ఇతర శాఖలకు పంపించేస్తే మిగిలిన సిబ్బందితో రైతులకు సేవలు అందించడం కష్టంగా మారనుంది.

వైఎస్సార్‌సీపీ హయాంలో ఆర్బీకేల పరిస్థితి..

- ఆర్‌బీకేలలో అగ్రికల్చర్, హార్టికల్చర్ అసిస్టెంట్, సెరికల్చర్ అసిస్టెంట్, విలేజ్ యానిమల్ హజ్బెండరీ అసిస్టెంట్, విలేజ్ ఫిషరీష్ అసిస్టెంట్లు ఉంటారు.
- రైతులకు సబ్సిడీపై విత్తనాల పంపిణీ.
- సర్టిఫైడ్ హమీతో కూడిన యంత్రాల సరఫరా.
- ఈ క్రాప్ బుకింగ్‌కు రైతు డేటా అప్‌లోడ్ చేయడం.
- పంట సాగుదారులకు హక్కు ధ్రువీకరణ పత్రాల జారీ.
- విత్తన సేకరణ కార్యకలాపాలు.
- పీఎం కిసాన్, వైఎస్సార్ సున్నావడ్డీ పథకం వంటి పంట రుణాల కోసం డేటా అప్‌లోడ్ చేయడం.
- విత్తనాలు, ఎరువులు, పురుగు నివారణ మందులు, పశువులు దాణాలను పరీక్షించి, అనంతరం సరఫరా చేయం.
- వివిధ పథకాలకు లబ్ధిదారుల ఎంపిక, ప్రకృతి వైపరిత్యాల సమయంలో సహాయం అందజేత.
- డిజిటల్ లైబ్రరీ ద్వారా తెగుళ్లు, వ్యాధులపై అవగాహన కల్పించడం.
- పొలంబడి, సీడ్ విలేజ్ ప్రొగ్రాం, మినీ కిట్ల ట్రయల్, ప్లాగ్ సీప్ ప్రొగ్రాంల నిర్వహణ.
- విత్తన పరీక్ష (భౌతిక స్వచ్ఛత, ఆహరోత్పత్తి పరీక్ష)
- స్మార్ట్ టీవీ (డిజిటల్ సిగ్నేజ్) క్రాప్ నిపుణులచే సాంకేతిక సెషన్‌లు నిర్వహించి సలహాలు అందించడం.
- స్ప్రేయర్స్ వంటి చిన్న వ్యవసాయ పరికరాలు అద్దెకు ఇవ్వడం.
- బీజామృతం మొదలైన సహజ ఉత్తత్తులపై ప్రదర్శనలు నిర్వహించి అవగాహన కల్పించడం.
- రైతుల వివరాలతో పాటు భూముల వివరాలు నిక్షిప్తం చేయడం.
- జంతు ఆరోగ్య కార్డులు జారీ.
- ప్రాథమిక ఆరోగ్య సంరక్షణ, జంతువులకు ప్రథమ చికిత్స అందించడం.
- ఈ క్రాప్ బుకింగ్ ద్వారా పశుగ్రాసం అవసరాన్ని లెక్కించడం వంటి కార్యక్రమాలు నిర్వహించేవారు. ఇంతటి సేవలు అందించే కేంద్రాలను కుదించితే రైతులకు ఇకపై ఇబ్బందులు తప్పవు.

ఐదేళ్లూ ఇబ్బంది పడలేదు..

వైఎస్సార్‌సీపీ హయాంలో వ్యవసాయం పండగలా మారింది. గ్రామాల్లోనే ఆర్‌బీకేలు ఏర్పాటు చేయడం ద్వారా విత్తనం దగ్గర నుంచి ఎరువు వరకు అన్నీ అందుబాటులో లభించేవి. పండిన పంటకు గిట్టుబాటు ధర కల్పించి స్థానికంగానే కొనుగోలు చేసేవారు. ఈ ఐదేళ్లు మాకు ఎటువంటి ఇబ్బందులూ రాలేదు. అన్నదాతకు అండగా నిలిచిన రైతుసేవా కేంద్రాలను కుదిస్తే వ్యవసాయం దండగ అనే భావన మళ్లీ కలుగుతుంది. జగనన్న మానసపుత్రిక లాంటి రైతుసేవా కేంద్రాలను కూటమి ప్రభుత్వం కొనసాగించి, అన్నదాతను ఆదుకోవాలి.

చుక్క మురళి, చుక్కపేట, దత్తిరాజేరు మండలం

పైకప్పు లేని వాల్వ్..



మేజర్ పంచాయతీ పరిధిలోని విజయనగరం – పాలకొండ ప్రధాన రహదారిని ఆనుకుని అన్నపూర్ణ కాలనీకి వెళ్లే రహదారిలో తాగునీటి పైప్‌లైన్‌కు సంబంధించిన వాల్వ్‌కు పైకప్పు ఏర్పాటు చేయలేదు. దీంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని వాహన చోదకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ రహదారిపై నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఏమాత్రం అలక్ష్యగా ఉన్న వాల్వ్‌లో పడిపోయే అవకాశం ఉంది. అధికారులు స్పందించి పైకప్పు వేయాలని పలువురు కోరుతున్నారు.

– చీపురుపల్లి

నేడు ‘జిందాల్’ నిర్వాసితులతో సమావేశం



జిందాల్ నిర్వాసితులతో ఎమ్మెల్సీ రఘురాజు

శృంగవరపుకోట: జిందాల్ పరిశ్రమ కోసం వేల ఎకరాల భూములిచ్చి కూలీలుగా మారిన నిర్వాసిత రైతుల సమస్యలపై కార్యాచరణ రూపొందించడానికి గురువారం ఉదయం 10 గంటలకు బొడ్డవర గ్రామంలోని సాయిభవానీ కల్యాణ మంటపంలో సమావేశం నిర్వహించనున్నట్లు ఎమ్మెల్సీ రఘురాజు ప్రకటించారు. ఈ మేరకు ఆయన భవానీనగర్‌లోని గ్రామైక్య సంఘ భవనంలో పలువురు నిర్వాసితులతో సమావేశమమై చర్చించారు. ఈ సందర్భంగా రఘురాజు మాట్లాడుతూ.. జిందాల్ పరిశ్రమ కోసం వేల ఎకరాల భూములిచ్చి 18 ఏళ్లు గడుస్తున్నా జిందాల్ యాజమాన్యం, ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. నిర్వాసితులకు సత్వర న్యాయం అందేలా ఉద్యమించడం కోసం సీపీఐ, సీపీఎంలతో కలిసి సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు.

దివ్యాంగుల గుర్తింపు సర్వే

గంట్యాడ: దివ్యాంగ చిన్నారులను గుర్తించడానికి సర్వే నిర్వహించనున్నట్లు ఎంఈఓ విజయకుమారి తెలిపారు. ప్రత్యేక అవసరాలు గల పిల్లలను గుర్తించి వాళ్లను పాఠశాలల్లో చేర్పించాలన్నారు. మండలంలోని నరవ అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆమె బుధవారం సందర్శించారు. కార్యక్రమంలో రమేష్, తదితరులు పాల్గొన్నారు.



నరవ అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ విజయకుమారి

జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శిగా ‘మిరియాల’



మిరియాల కృష్ణారావు

చీపురుపల్లి: జనవిజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శిగా పట్టణానికి చెందిన సీనియర్ జీవశాస్త్ర ఉపాధ్యాయుడు మిరియాల కృష్ణారావు నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలో రెండు రోజుల కిందట జరిగిన జనవిజ్ఞాన వేదిక 18వ జిల్లా మహాసభల్లో ఆయన్ను జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమిస్తూ రాష్ట్ర శాఖ నిర్ణయం తీసుకోగా.. బుధవారం ఆయనకు ఉత్తర్వులు అందాయి. కృష్ణారావు గతంలో జిల్లా సైన్స్ అధికారిగా పనిచేశారు. ప్రస్తుతం సుపథ స్వచ్ఛంద సేవా సంఘం ప్రధాన కార్యదర్శిగా, ఆల్ ఇండియా సైకాలజీ అసోసియేషన్ విజయనగరం జిల్లా అధ్యక్షుడిగా, చైల్డ్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం రాష్ట్ర సలహాదారునిగా, ఏపీ బయాలజీ ఉపాధ్యాయుల ఫోరం రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా సేవలు అందిస్తున్నారు. ఆయన నియామకంపై పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు వలిరెడ్డి రవీంద్రనాయుడు, యూటీఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షుడు మీసాల అప్పలనాయుడు, శ్రీనివాస ప్రసాద్, మీసాల వెంకటరమణ, గంటాన అప్పారావు, అడ్డూరి కృష్ణ, తదితరులు అభినందనలు తెలియజేశారు.

కౌలు రైతులకు గుర్తింపు కార్డులు

- వ్యవసాయ శాఖ ఏడీఏ మహారాజన్



కౌలు రైతుల అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఏడీఏ మహరాజన్

గజపతినగరం: భూమిని కౌలుకు చేస్తున్న ప్రతి రైతుకీ కౌలురైతు గుర్తింపు కార్డులు మంజూరు చేస్తామని వ్యవసాయశాఖ గజపతినగరం ఏడీఏ కె. మహరాజన్ అన్నారు. మండలంలోని పాతబగ్గాం రైతుసేవా కేంద్రంలో ‘కౌలు రైతులకు పంట సాగుదారుని హక్కుపత్రం’ అనే అంశంపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కౌలురైతులకు గుర్తింపు కార్డులు మంజూరైతే పంట మీద వచ్చే ప్రతి హక్కును పొందవచ్చన్నారు. పంట మీద రుణం, దిగుబడి విక్రయించడం, ప్రకృతి వైపరిత్యాల వల్ల కలిగే నష్టాలకు పరిహారం పొందడం వంటి లాభాలు కలుగుతాయని చెప్పారు. అదేవిధంగా భూమి యజమానికి ఎటువంటి నష్టం కలగకుండా కౌలు చట్టం చేయబడిందన్నారు. కౌలు కార్డులు కేవలం 11 నెలలు మాత్రమే పని చేస్తుందని.. కేవలం పంట మీద మాత్రమే హక్కు ఉంటుందని ఏడీఏ స్పష్టం చేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయశాఖాధికారి ధనలక్ష్మి, గ్రామ రెవెన్యూ అధికారి అప్పలనాయుడు, గ్రామ వ్యవసాయ సహాయకుడు ప్రవీణ్, సర్పంచ్ లెంక పద్మావతి, గ్రామ పెద్దలు లెంక చిన్నంనాయుడు, పప్పల గురినాయుడు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం..



గుర్ల: ఎంపీడీఓ కార్యాలయంలో యోగాసనాలు వేస్తున్న అధికారులు

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని వక్తలు అభిప్రాయపడ్డారు. యోగాంధ్రలో భాగంగా అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు మండల కేంద్రాలు, గ్రామాల్లో బుధవారం అవగాహన ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా యోగాసనాలు వేస్తూ వాటి వల్ల కలిగే లాభాలను వివరించారు. నేటి ఆధునిక జీవితంలో ఒత్తిడికి దూరంగా ఉండాలన్నా.. వ్యాధులు దరి చేరకూడదన్నా యోగా ఒక్కటే మార్గమని అవగాహన కల్పించారు.

– గుర్ల/గజపతినగరం/బొండపల్లి/వేపాడ



గజపతినగరం: ర్యాలీలో పాల్గొన్న అధికారులు, ప్రజా ప్రతినిధులు



బొండపల్లి: యోగా ఆవశ్యకతపై అవగాహన ర్యాలీ



వేపాడ: సిబ్బందితో యోగాసనాలు వేయిస్తున్న ఎంపీడీఓ సూర్యనారాయణ, యోగా గురువు వెంకటరావు

శిథిలావస్థలో ప్రభుత్వ భవనాలు



శిథిలావస్థకు చేరుకున్న పాత తహసీల్దార్ కార్యాలయ భవనం



ఎప్పుడు కూలుతుందో తెలియని పాత ట్రెజరీ కార్యాలయం

మెరకముడిదాం: మండల కేంద్రంలో ప్రభుత్వ భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. తహసీల్దార్ కార్యాలయం ఇప్పటికే పూర్తిగా శిథిలమై పైకప్పు మొత్తం వర్షాలకు కారిపోతోంది. దీంతో ఈ కార్యాలయాన్ని కొన్నేళ్ల కిందటే ఖాళీ చేశారు. అలాగే ఈ భవనాన్ని ఆనుకుని మరొక ప్రభుత్వ భవనం కూడా శిథిలావస్థకు చేరుకుంది. ఈ భవనాన్ని కొన్నేళ్ల కిందట ట్రెజరీ కార్యాలయం కోసం నిర్మించారు. అయితే భవనాన్ని నిర్మించారు కానీ ట్రెజరీ సిబ్బంది మాత్రం భవనంలోకి రాలేదు. దీంతో అప్పటినుంచి ఈ భవనం వివిధ కార్యాలయాల సిబ్బందికి పొరుగు సేవలు అందిస్తూ వచ్చింది. అయితే ఈ కార్యాలయం కూడా ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకుంది. ఇప్పుడు ఈ భవనం పైకప్పు పెచ్చులూడి పడుతుండడంతో వినియోగానికి దూరంగా ఉంది. పైగా ఈ భవనం ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం స్పందిచి ఈ రెండు భవనాలను తొలగించి నూతన భవనాన్ని నిర్మించి తహసీల్దార్ కార్యాలయంగా వినియోగించాలని పలువురు కోరుతున్నారు. సొంత భవనం లేకపోవడంతో ప్రస్తుతం తహసీల్దార్ కార్యాలయాన్ని స్త్రీ శక్తి భవనంలో నిర్వహిస్తున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి శిథిల భవనాలను తొలగించి, వాటి స్థానంలో తహసీల్దార్ కార్యాలయం కోసం నూతన భవనం నిర్మించాలని మండల వాసులు కోరుతున్నారు.

విద్యుత్ సరఫరా నిలిపివేత రేపు

గజపతినగరం: మండలంలోని జిన్నాం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో జంగిల్ క్లియరెన్స్ చేపట్టనున్న నేపథ్యంలో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం రెండు వరకు సరఫరా నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో బొబ్బిలి డివిజన్ కార్యనిర్వాహక ఇంజినీర్ ఎ. అనంతరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తుమికాపల్లి, లోగిశ, కెంగువ, మల్లునాయుడు పేట, తదితర గ్రామాల్లో సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

వైభవంగా పరదేశమ్మ విగ్రహ ప్రతిష్ఠ





చినరామునాయుడును సన్మానిస్తున్న మాజీ మంత్రి ముత్యాలునాయుడు, (ఇన్‌సెట్లో) ప్రతిష్ఠించిన అమ్మవారి విగ్రహం

వేపాడ: మండలంలోని బానాదిలో నూతనంగా నిర్మించిన ఆలయంలో పరదేశమ్మ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం బుధవారం వైభవంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన చప్ప, చలుమూరి, గుమ్మడి, తదితర కుటుంబాలు, గ్రామపెద్దలు, దాతల సహకారంతో ఆలయం నిర్మించారు. వేద పండితులు మేడపాటి కిషోర్ శర్మ బృందం ఆధ్వర్యంలో విగ్రహ ప్రతిష్ఠ, కలశస్థాపన, తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అమ్మవారి దర్శనం కల్పించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి బూడి ముత్యాలునాయుడు, డీసీసీబీ మాజీ చైర్మన్ వేచలపు వెంకట చినరామునాయుడు, బానాది ఎంపీటీసీ సభ్యురాలు గొంప తులసి, వెంకటరావు దంపతులు, తదితరులు పాల్గొన్నారు. మంత్రి ముత్యాలునాయుడు చేతుల మీదుగా చినరామునాయుడుతో పాటు పలువురు దంపతులను సన్మానించారు. అనంతరం మధ్యాహ్నం అన్న సమారాధన నిర్వహించారు.

ఉగ్రవాదాన్ని అంతమొందించాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు టీవీ రమణ



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి కార్యవర్గ సభ్యుడు టీవీ రమణ



సమావేశంలో పాల్గొన్న సీపీఎం నాయకులు, కార్యకర్తలు

గజపతినగరం: ఉగ్రవాదాన్ని అంతమొందించాల్సిన బాధ్యత భారతీయులందరిపైనా ఉందని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు టీవీ రమణ అన్నారు. బుధవారం స్థానిక ఎస్‌జీఓ హోమ్‌లో పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమైక్యతా యాత్రలో ఆయన మాట్లాడుతూ.. పహల్గామ్ దాడిని అందరూ ఖండించాలన్నారు. ఆపరేషన్ సుందూర్‌లో భాగంగా భారత సైన్యం వీరోచితంగా పోరాడిందని కొనియాడారు. దీనికి అన్ని రాజకీయ పార్టీలూ, సంస్థలు బాసటగా నిలిచాయన్నారు. అయితే బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్‌లు హిందూ మతోన్మాదాన్ని రెచ్చగొట్టి దేశ ఐక్యతను విచ్ఛిన్నం చేస్తున్నాయని ఆరోపించారు. ప్రజల ప్రాణాలకు, సైనికుల త్యాగాలకు విలువ ఇవ్వడం లేదని మండిపడ్డారు. ఇప్పటికైనా బీజేపీ ప్రజా వ్యతిరేక విధానాలు మానుకుని దేశ సమగ్రతను కాపాడాలని డిమాండ్ చేశారు. బీజేపీ కుట్రలకు రాష్ట్ర కూటమి నాయకులు సహకరించడం అన్యాయమన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు జి.శ్రీనివాస్, జిల్లా నాయకులు రాములు, హరికృష్ణ, వేణి, సోములు, అప్పలనరసయ్య, టి.రాము, అప్పలస్వామి, తదితరులు పాల్గొన్నారు.

నేడు అభయాంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం

బొండపల్లి: మండలంలోని బోడసింగిపేటలో కోర్టుకు వెళ్లే రహదారిలో గల అభయాంజనేయ స్వామి ఆలయం ద్వితీయ వార్షికోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం, మధ్యాహ్నం భారీ అన్నసమారాధన నిర్వహిస్తామని పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

నిబంధనలకు పాతర

- ఇష్టానుసారంగా రోడ్ల నిర్మాణాలు

కొత్తవలస: కూటమి ప్రభుత్వ పాలనలో అధికారులు, కాంట్రాక్టర్లు నిబంధనలు పాటించడం లేదు. అధికారం తమదే అన్న భావనతో నాయకులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. అధికారులను గుప్పిట్లో ఉంచుకుని తమకు నచ్చినట్లు పనులు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మండలంలోని పలు గ్రామాల్లో కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత సీసీ రోడ్లు వేశారు. అయితే ఎక్కడా నిబంధనలు పాటించకుండా పనులు చేశారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. కొత్తవలస మేజర్ పంచాయతీ గవరపాలెం గ్రామం నుంచి మంగళపాలెం వరకు రూ. 50 లక్షలతో సీసీ రోడ్డు వేశారు. ఈ రోడ్డు పూర్తిగా చెరువు గట్టు పైనుంచి వేశారు. అయితే రోడ్డు మధ్యలో 11కేవీ విద్యుత్ స్తంభాలున్నా వాటిని తరలించకుండానే సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టారు. విద్యుత్ స్తంభాలు మార్చకుండా రోడ్డు వేయడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం ఆ విద్యుత్ స్తంభాలు ప్రమాదకరంగా మారాయి. అధికారులు స్పందించి స్తంభాలు తొలగించకుండా రోడ్డు వేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



గవరపాలెం – మంగళపాలెం రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాలు